భయపెడుతున్న హైనా
● మరోసారి దాడి..
రెండు మేకలు మృతి
7





అక్కన్నపేట మండలం రామవరంలో నాగలితో పత్తి విత్తనాలు నాటడానికి అచ్చు కొడుతున్న రైతు, విత్తనాలు విత్తుతున్న కూలీలు

## నాగలి పట్టి.. దుక్కి దున్ని..

### వ్యవసాయ పనుల్లో రైతులు

మృగశిర కార్తెలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి నిమగ్నమయ్యారు. మంగళవారం అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల్లో దుక్కులు దున్నుతూ విత్తనాలు వేస్తూ కనిపించారు. హుస్నాబాద్ డివిజన్‌లో రైతులు ప్రధానంగా వానాకాలం సాగులో వరి తర్వాత పత్తి, మొక్క జొన్న పంటల సాగుపైనే అధికంగా దృష్టి సారిస్తున్నారు.

- అక్కన్నపేట, జూన్ 11,



హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో నాగలితో దుక్కి దున్నుతూ మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న కూలీలు



సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలిస్తున్న డీపీవో దేవకీదేవి

## ప్రగతి మారలే..!

● గ్రామాలను పరిశీలించిన అధికారులు
● ఎక్కడికక్కడ అస్తవ్యస్తం
● సర్వే పూర్తిచేసిన అధికారులు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 11: గత ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి పేరుతో ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనుల పరిస్థితిపై అధికారులు ఆరాతీస్తున్నారు. రూ.కోట్లు ఖర్చుచేసిన పనులు ఇప్పుడు పనికి వస్తాయో.. అసలు వాటి పరిస్థితి ఏమిటీ అన్నది పంచాయతీ కార్యదర్శులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పనులకు సంబంధించిన నివేదికను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను పంపించారు.

**గాడి తప్పిన నిర్వహణ**

పల్లెల్లో పచ్చదనం పెంచడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. గతించిన వారికి అంత్యక్రియలు చేసే సమయంలో ఇబ్బందులు ఎదురవ్వకుండా వైకుంఠధామాలు నిర్మించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా వేరుచేసి సేంద్రియ ఎరువుల తయారీకి సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. గ్రామీణ యువతీ, యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రకృతివనాలు నిర్వహణ లేక చిట్టడవులను తలపించేలా మారాయి. చెరువులు, వాగుల సమీపంలో ఏర్పాటుచేసిన వనాలు అస్తవ్యస్తంగా మారాయి. అనేక వైకుంఠధామాల్లో విద్యుత్తు, నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్నాయి. చాలాచోట్ల ఆటలకు ఏమాత్రం అనువుగా లేని స్థలాల్లో ఆర్భాటంగా క్రీడా ప్రాంగణాలు నిర్మించడంతో అవి వినియోగంలో లేవు. సేంద్రియ ఎరువులను తయారు చేయాలనే సంకల్పంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారగా.. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్కడక్కడ ఎరువుల తయారీ ప్రక్రియను చేపట్టారు.

**అధికారుల పరిశీలన ఇలా..**

జిల్లాలో చేపట్టిన పల్లెప్రగతి పనులపై ప్రభుత్వం ఆరాతీయడంతో అధికారులు పంచాయతీ కార్యదర్శులతో కలిసి గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. వైకుంఠధామాలకు నీరు, విద్యుత్, రహదారులు, మూత్రశాలల ఏర్పాటు వివరాలను సేకరిస్తున్నారు. ప్రకృతివనంలో నాటిన మొక్కల్లో ఎన్ని బతికున్నాయో నమోదు చేశారు. తడి, పొడి చెత్తను కంపోస్టు షెడ్లకు తరలించారా..? ఏ మేరకు సేంద్రియ ఎరువులు తయారు చేశారు..? ఇప్పటివరకు సమకూరిన ఆదాయం వంటి వివరాలను సేకరించారు. క్రీడా ప్రాంగణాల్లో వసతుల కల్పన, అమర్చిన పరికరాలు, నర్సరీల్లో నాటిన విత్తనాలు ఏ మేరకు మొలకెత్తాయోనని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను పంచాయతీల వారీగా నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఇదిలా ఉండగా వారంరోజుల క్రితమే క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను పంచాయతీల వారీగా నివేదికలు తయారు చేసి పంపించామని డీపీవో దేవకీదేవి తెలిపారు.



సిద్దిపేటలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో, అధికారులు

'మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలను మనఊరు-మనబడి పథకం ద్వారా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అదనపు గదులు నిర్మాణంలో ఉండగానే బిల్లులు రాకపోవడంతో పనులను అసంపూర్తిగా వదిలేశారు. తరగతుల బోధనకు ఈ భవనం ఉపయోగపడదు. కొత్తగా నల్లాలు కూడా బిగించలేదు.'

'తొగుట మండలం గోవర్ధనగిరి ప్రాథమికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. నిత్యం స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులపై పడే పరిస్థితి ఉండేది. వర్షం పడినప్పుడు విద్యార్థులను ఇతర గదుల్లోకి పంపిస్తుంటారు.'

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 11



శిథిలావస్థకు చేరి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న అక్కన్నపేట మండలం జనగామ ప్రభుత్వ పాఠశాల భవనం

# బడుల్లో సమస్యల గంట

### నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

● సర్కారు స్కూళ్లలో సమస్యల తిష్ట
● లక్ష్యం చేరని 'మనఊరు-మనబడి'
● పలుచోట్లా మరుగుదొడ్లు, తాగునీటి ఇబ్బందులు
● శిథిలావస్థకు చేరిన గదుల్లోనే తరగతులు



నిర్మాణ దశలోనే ఉన్న మద్దూరు ప్రాథమిక పాఠశాల భవనం

ధర్మారం, గోవర్ధనగిరి పాఠశాలల్లోనే కాదు. జిల్లాలోని పలుచోట్లా ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' ప్రస్తుత ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ పాఠశాల' అనే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. కానీ సవాలక్ష కారణాలతో ఈ పథకం లక్ష్యాన్ని చేరలేకపోయింది. కొన్ని చోట్లా ఆశించిన ఫలితాలు కనిపించగా.. చాలా పాఠశాలల్లో అసంపూర్తిగా.. నత్తనడకన.. ప్రగతికి దూరంగా సాగుతున్నాయి.

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాల సంఖ్య 1,018కు చేరాయి. ఇందులో 814 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర పనులు చేయిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం రూ.34.80 కోట్లు కేటాయించింది. కానీ ఇప్పటివరకు రూ.8.20 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. 375 పాఠశాలల్లో పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లోనూ డ్యూయల్ డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, పాఠశాలలకు రంగులు వేసే కార్యక్రమాన్ని 20వరకు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది ఎంతవరకు సాధ్యపడుతుందో చూడాలి. మరో పక్క పాఠశాలలు పునఃప్రారంభం నాటికే యూనిఫాంలు అందిస్తామని చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో విద్యార్థులకు యూనిఫామ్ రాలేదు. ఒక జత మాత్రమే పాఠశాలలకు చేరినట్లుగా తెలుస్తోంది.

**పనుల్లో జాప్యం**

పాఠశాలల్లో చేపట్టిన అత్యవసర పనుల్లోనూ తీవ్ర జాప్యం జరిగింది. వేసవి సెలవులు కావడంతో చకచకా పెండింగ్ పనులను పూర్తి చేయాలని భావించారు. నిధుల లోపంతోపాటు ఎన్నికల నిర్వహణ ఒక కారణమైంది. కొన్నిచోట్లా కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడమూ జరిగింది. గత నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవలే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ దాదాపు ప్రభుత్వ పాఠశాలల్లోనే కొనసాగింది. ఈ ప్రభావం మరమ్మతులపై పడింది. ఇక అధికారులకు ఎన్నికల విధుల భారం ఉండడంతో పాఠశాలల ప్రగతి పనులపై సరైన దృష్టి పెట్టలేకపోయారు. దీంతో పాఠశాలల ప్రారంభానికి అన్ని స్కూళ్లు సిద్ధం కాలేకపోయాయి. కనీస అవసరాలైన మరుగుదొడ్లు, కుళాయిలు, విద్యుత్ సౌకర్యాలు అందుబాటులో లేని పాఠశాలలూ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. కనీసం వీటినైనా ఈనెలాఖరులోగా పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



ధూళిమిట్ట మండలం లింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో అధ్వానంగా వంటగది




తొగుట మండలం గోవర్ధనగిరి పాఠశాల భవనానికి పగుళ్లు

స్కూల్‌కు వెళ్దాం.. చలో..! 7

# ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

● తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

ములుగు, జూన్ 11: ఆర్థికంగా ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యమవుతున్నదని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18శాతానికి పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో.. మరింత వృద్ధి రేటు కోసం ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి పూర్తి మద్దతు ఇస్తున్నదని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని గవర్నర్ పిలుపునిచ్చారు. అనంతరం తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రెసిషన్ ఫామింగ్, బిగ్ డేటా, కృత్రిమ మేధస్సు, రోబోట్స్ డ్రోన్స్, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాంతో పంటల ఉత్పాదకత పెరుగుతుందన్నారు.

**బంగారు పతకాల ప్రదానం**

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్‌లో అత్యధిక జీపీఏ సాధించినందుకుగానూ 2023 బ్యాచ్‌కు చెందిన ఆర్.వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బీఎస్సీ హానర్స్ ఫారెస్ట్రీలో పీసీసీఎఫ్ గోల్డ్ మెడల్ కె.రవళి, డీన్స్ గోల్డ్‌మెడల్ కె.ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్‌లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు ఎస్కేఎల్‌టీఎస్‌హెచ్ గోల్డ్‌మెడల్, అలాగే విద్యార్థినుల్లో అత్యధిక మార్కులు సాధించిన, కూరగాయల విభాగంలో టాపర్లుగా నిలిచిన ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జీఎస్ దివ్య, పూలశాస్త్ర విభాగంలో పి.విద్యశ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. ఈ స్నాతకోత్సవంలో 156 మందికి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, మరో ఆరుగురికి పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలు ప్రదానం చేశారు. వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ ఏ.భగవాన్, డీన్ డాక్టర్ ఎం.రాజశేఖర్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ కిరణ్, డీఎస్‌ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాస్, ఉద్యానశాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, బోర్డుమెంబర్ డాక్టర్ ఆర్కే మాథూర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




హార్టికల్చర్ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న గవర్నర్

## ప్రాణం తీసిన ఈత సరదా..

● మేనబావతో కలిసి ఈతకు వెళ్లి యువకుడి మృతి



గిరీష్(ఫైల్)

సిద్దిపేట క్రైం, జూన్ 11: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. సిద్దిపేట పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన టేకుపల్లి జాన్‌బాబు, సంగీత పెద్ద కుమారుడు గిరీష్(17) బాసర ట్రిబుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాడు. వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చిన గిరీష్ మంగళవారం సాయంత్రం మేనబావ సాయికిరణ్‌తో కలిసి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉన్న మున్సిపాలిటీ స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లాడు. ఏడు ఫీట్ల లోతు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఇద్దరూ దూకగా.. సాయికిరణ్ ఈదుకుంటూ ముందుకు వెళ్లాడు. గిరీష్ కనిపించకపోవడంతో వచ్చి చూసేసరికి ఓ మూలన నీటిలో మునిగిపోయి కనిపించాడు. వెంటనే అతడిని పైకి తీసి సీపీఆర్ చేశాడు. అనంతరం బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ధరల దడ

● మండుతున్న కూరగాయల ధరలు
● కొనడానికి జంకుతున్న జనాలు



నారాయణఖేడ్, జూన్ 11: కూరగాయల ధరలు మండుతున్నాయి. కొనుగోలు చేయడానికి జనాలు జంకుతున్నారు. పచ్చిమిర్చి, బీరకాయ, బీర్నీస్, క్యాప్సికం, ధరలు కిలో రూ.100 దాటాయి. సాధారణంగా వేసవిలో, పెళ్లిలు, శుభకార్యాల సీజన్‌లో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. ప్రస్తుతం శుభకార్యాలు లేకపోయినా ధరలు పోటీపడి పెరుగుతుండడంతో జనాలు బెంబేలెత్తుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో నారాయణఖేడ్‌లో మంగళవారం సంత వెలవెలబోయింది. మొన్నటి వరకు కిలో రూ.60 ఉన్న పచ్చిమిర్చి రూ.100 దాటింది. బీరకాయ, బీర్నీస్, క్యాప్సికం కూడా కిలో రూ.100 ధర పలికాయి. టమాటా కిలో రూ.30 నుంచి రూ.60కి పెరిగింది. చిక్కుడు కిలో రూ.80, దొండ, బెండ కిలో రూ.60 చొప్పున విక్రయించారు. ఆకుకూరల ధరలు కూడా గత వారంతో పోలిస్తే రెట్టింపయ్యాయి. ఉల్లిగడ్డ కిలో రూ.30 పలికింది. పచ్చళ్ల సీజన్ పూర్తికావస్తున్నప్పటికీ అల్లం, వెల్లుల్లి ధరలు ఇంకా పైపైకి పోతున్నాయి. రూ.500 తీసుకొని మార్కెట్‌కు వెళ్తే వారానికి సరిపడా కూరలు కూడా రావడం లేదని కొనుగోలు దారులు వాపోతున్నారు. మొన్నటి వరకు ఎండల తీవ్రత కారణంగా స్థానికంగా పంటలు లేవని, దూర ప్రాంతాల నుంచి అధిక ధరలకు దిగుమతి చేసుకొని విక్రయించాల్సి వస్తున్నదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరు వరకు ధరలు ఇలాగే పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు, కూరగాయల ధరలు పెరుగుండడంతో పప్పులతో సరిపెట్టుకుందామంటే.. వాటి ధరలు కూడా ఆకాశనంగుతున్నాయి. కందిపప్పు, పెసర పప్పు కిలో రూ.180 వరకు విక్రయిస్తున్నారు.

## పిడుగుపడి రైతు మృతి

● పత్తి పంట సాగుచేస్తుండగా ఘటన



శ్రీశైలం మృతదేహం

తొగుట, జూన్ 11: పత్తి పంట సాగు చేస్తుండగా పిడుగుపడి రైతు మృతిచెందాడు. ఈ సంఘటన తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కడారి శ్రీశైలం(45) తనకున్న 4 ఎకరాల భూమిలో పత్తి పంట సాగుచేసేందుకు మంగళవారం కూలీలను పిలిచాడు. ఎడ్లతో పత్తి విత్తనాలను విత్తేందుకు అచ్చు తోలుతున్న క్రమంలో సాయంత్రం అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. ఎడ్ల నాగలిని పక్కకు నిలిపి సమీపంలో ఉన్న తుమ్మ చెట్టు కిందకు చేరుకున్నాడు. ఈ క్రమంలో పిడుగు పడడంతో అతడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబీకులు, గ్రామస్థులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య తార, కొడుకు ఎలక్షన్, కూతుళ్లు అశ్విని, మానస ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ చిలివేరి జ్యోతీమల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కనకయ్య కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



బొల్లారంలో మొక్క నాటుతున్న చైర్ పర్సన్, కమిషనర్

జిన్నారం, జూన్ 11: పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. మంగళవారం బొల్లారం వైఎస్ఆర్ కాలనీ పార్కులో హరితహారంలో భాగంగా చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ మొక్కలు నాటారు. మున్సిపాలిటీలో హరితహారం లక్ష్యం నెరవేరేలా మొక్కలు నాటి సంరక్షణ కోసం చర్యలు చేపడుతామని చైర్ పర్సన్ అన్నారు.

## రాష్ట్రాభివృద్ధిలో మంత్రులు కీలక పాత్రను పోషించాలి

### -జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్

జహీరాబాద్, జూన్ 11: తెలంగాణ నుంచి బీజేపీ తరఫున నియమితులైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వారిపై నమ్మకం ఉంచి పార్లమెంట్‌కు పంపించారని, గతంలో వలె కేంద్రం నుంచి పెద్దమొత్తంలో నిధులను తీసుకువచ్చి ప్రజల ఆకాంక్షను నేరవేర్చేలా కృషిచేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు, బీజేపీతోనే ప్రజలు ఆశించిన అభివృద్ధి జరుగనుందని ఆయన గుర్తు చేశారు.

## స్కావెంజర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలు

నారాయణఖేడ్, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం పనులు చేయడానికి, తాగునీటి సదుపాయం కల్పించడానికి స్కావెంజర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పలు పాఠశాలల్లో స్కావెంజర్లను ఏర్పాటు చేయడానికి పలువురు దాతలు ముందుకు వచ్చారు. మండల పరిధిలోని చల్లగిద్ద తండా ప్రాథమిక పాఠశాల, ర్యాకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కావెంజర్ల కోసం ఏడాది పాటు వేతనం అందిస్తానని, ఎంపీపీ చాందిబాయి తనయుడు రమేష్ చౌహాన్ తెలిపారు. గంగాపూర్ పాఠశాలలో ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, సంజీవన్‌రావు పేట పాఠశాలలో ఎంపీటీసీ భూపాల్‌లు స్కావెంజర్లకు ఏడాదిపాటు వేతనాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## పారిశ్రామిక ప్రాంత సమస్యలు పరిష్కరించాలి



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య, నాయకులు

జిన్నారం, జూన్ 11: పారిశ్రామిక ప్రాంత సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాజీపల్లిలో సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిన్నారం మండలంలోని బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామికవాడలలో ఈఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేసి కార్మికుల సంఖ్యకు అనుగుణంగా చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డిస్పెన్సరీని విస్తరించాలన్నారు. అదేవిధంగా పారిశ్రామికవాడలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరారు. అతి పెద్ద పారిశ్రామిక వాడ బొల్లారంలో ప్రభుత్వం ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అన్ని పారిశ్రామిక వాడల్లో రహదారుల ఏర్పాటు, మిషన్ భగీరథ నీటి సరఫరా చేపట్టాలని సమావేశంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, శేఖర్, హుస్సేన్, నర్సింహగౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



హుస్నాబాద్, జూన్ 11: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం దాదాపు ఆరు గంటల పాటు క్యూలో నిలుచున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మ వారికి బోనాలు, పట్నాలు వేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



# స్కూల్‌కు వెళ్దాం.. చలో..!

● మొదటిసారి వెళ్లే పిల్లల పట్ల జాగ్రత్త ● మారం చేస్తే నచ్చజెప్పాలి ● జంక్‌ఫుడ్ వద్దు.. నచ్చింది పెడుదాం

మెదక్ కల్చరల్, జూన్ 11: వేసవి సెలవులు ముగిశాయి. పిల్లలు రాత్రి ఆలస్యంగా పడుకుని, పొద్దెక్కేదాక పడుకునే రోజులయిపోయాయి. నేటి నుంచి బడి గంటలు మోగబోతున్నాయి. స్కూళ్లు తెరుస్తున్నారంటే.. 'అబ్బా.. ఇంత తొందర సెలవులు అయిపోయాయి' అని పిల్లలు.. 'పొద్దున్నే లేవాలి.. పిల్లల్ని రెడీ చేయాలి.. టిఫిన్ పెట్టాలి.. మారం చేస్తే బుజ్జగించాలి.. అబ్బా ఎన్ని పనులో..' అని తల్లిదండ్రులు అనుకుంటూ ఉంటారు. ఇక స్కూల్ ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు ఈ తతంగం అంతా సరే సరే. కానీ, ఇంతకాలం సెలవుల్లో ఎంజాయ్ చేసిన పిల్లలకు మళ్లీ స్కూల్‌కు పంపాలంటే, వారికి వారుగా బడికి వెళ్లాలంటే మొదట్లో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. కొత్తగా స్కూల్‌కు వెళ్లే పిల్లలు మరింత హైరానా పడుతుంటారు.



**మొదటిసారి బడికి పంపుతున్నారా...**

పిల్లలను స్కూల్‌కు పంపడం.. అందులోనూ మొదటి సారి బడికి పంపడం అంటే తల్లిదండ్రులకు పెద్ద యుద్ధంలానే ఉంటుంది. పిల్లలను నిద్ర లేపడం బ్రష్, స్నానం చేయించడం, స్కూల్‌కు రెడీ చేయించడం ఒక ఎత్తయితే అవన్నీ స్కూల్ టైం లోపలే పూర్తి చేయాల్సి ఉంటుంది. చెప్పిన వెంటనే విని తయారయ్యే పిల్లల కంటే విసిగించే పిల్లలే ఎక్కువ. అయితే, బడికి వెళ్లనని మారం చేసే పిల్లల విషయంలో తల్లిదండ్రులు విసుగు చెందకుండా వారిని బుజ్జగించి చెప్పాలి. విసిగించే పిల్లలైనా కొన్నిసార్లు చెబితే వింటారు. కొప్పడినా, కొట్టినా కొన్నిసార్లు ప్రయోజనం ఉండదనే విషయాన్ని గమనించాయి. అలా చేస్తే మొదటికే మోసం వస్తుంది.

**స్కూల్ ఫోబియా...**

కొత్తగా స్కూల్‌లోకి అడుగు పెట్టే చిన్నారుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్తగా వెళ్లే పిల్లలు స్కూల్ ఫోబియాతో కొంత అనారోగ్యానికి, అస్తవ్యస్థతకు గురయ్యే అవకాశం ఉంది. అలాంటప్పుడు బలవంతంగా స్కూల్లో ఉంచకూడదు. పాఠశాల యాజమాన్యం కానీ, క్లాస్‌టీచర్ కానీ పిల్లల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు చేరవేయాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తోటి విద్యార్థులతో ఎలా ఉండాలి, క్లాస్ రూమ్‌లో ఎలా ఉండాలి టీచర్లతో ఎలా ఉండాలి అనే విషయాలు తెలియ చేయాలి. స్కూల్‌లో మొదట్లో ఇచ్చే అసైన్మెంట్, హోంవర్క్ వారికి అర్థమయ్యే రీతిలో వివరించి, వాటి పట్ల ఉన్న భయాన్ని పోగొట్టాలి.

**ప్రణాళిక అవసరం**

పిల్లలని స్కూల్ పంపే ముందే ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. వేసవి సెలవులు అయిపోతున్నాయి అనే వారం ముందు నుంచే ఏదో ఒక వంకతో పిల్లలను తెల్లవారుజామునే నిద్రలేపాలి. దీంతో స్కూల్ తెరిచేలోగా వారికి స్కూల్ టైంకి లేవడం అలవాటవుతుంది. అలాగే, పై తరగతులకు వెళ్లే వారికి కొత్త పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, టిఫిన్ బాక్స్ లాంటివి ఇప్పించాలి. దీంతో వారికి ఎప్పుడెప్పుడు వాటిని తీసుకుని స్కూల్‌కు వెళ్లాలా అన్న ఆసక్తి పెరుగుతుంది.

**ఆహారం పట్లా జాగ్రత్త...**

స్కూల్‌కు వెళ్లే పిల్లల ఆహారం విషయంలో జాగ్రత వహించాలి. పొద్దున్నే పిల్లకు ఏమి తినిపించాలి. టిఫిన్ బాక్సులలో ఎం ఇవ్వాలి అనే విషయంలో పిల్లలకు ఏది ఇష్టమో అదే ఇవ్వాలి. అయితే, అందులో పోషకాలు ఉండేలా చూసుకోవాలి. జంక్‌ఫుడ్ జోలికి వెళ్లవద్దు. చాలామంది తల్లిదండ్రులు తొందరగా అవుతుందని ఉదయం వేళ గ్లాస్ పాలు, బిస్కట్లతో సరిపుచ్చుతారు. అది సరికాదు. పిల్లలకు కూరగాయలు, సలాడ్స్, ఇంట్లో చేసిన ఆహారపదార్థాలు పెట్టాలి.

### చదువు విలువ తెలియజేయాలి



దాదాపు రెండు నెలల సెలవుల తర్వాత మళ్లీ బడికి వెళ్లాలంటే పిల్లలకు భారంగానే ఉంటుంది. సెలవుల్లో హ్యాపీగా గడిపిన వారు మళ్లీ పొద్దున్నే లేచి బడికి వెళ్లడానికి కొంత ఇబ్బంది పడుతారు. అయితే, వారం ముందు నుంచే వారిని పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధంగా అలవాట్లు మార్చాలి. వారికి చదువు విలువను తెలియజేయాలి. అలాగే, పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.

– సురేష్, సైక్రియాట్రీ సోషల్ వర్కర్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మెదక్

## స్కూళ్లకు స్కావెంజర్లు వచ్చేనా..?

కొండపాక, జూన్ 11: నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో పారిశుద్ధ్యంపై ఉపాధ్యాయుల్లో బెంగపట్టుకుంది. పాఠశాలల పరిశుభ్రత కోసం నియమించిన స్కావెంజర్ల వ్యవస్థను గతంలో రద్దు చేశారు. పరిశుభ్రత నిర్వాహణను గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలకు అప్పగించారు. కానీ వారు అంతంత మాత్రంగానే పని చేయడంతో పాఠశాలల్లో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కొత్త ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తామని చెప్పింది. కానీ, పాఠశాలలు ప్రారంభమవుతున్న ఇంకా వారిని నియమించకపోవడంతో పాఠశాలల పరిశుభ్రత పరిస్థితి ఏమిటని వాపోతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల మరమ్మతులు, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు, మెరుగు పరచడం చేస్తున్నారు. అయితే, పాఠశాలల్లో పరిశుభ్రత ఎలా అంశాన్ని మాత్రం మర్చిపోయారు.

గతంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల కోసం స్వచ్ఛకార్మికులను నియమించుకొనేందుకు సమగ్ర శిక్ష గ్రాంట్ కేటాయించారు. ఈ క్రమంలోనే సిద్దిపేట జిల్లాలోని 976 పాఠశాలల్లో 1183 మంది స్వచ్ఛ కార్మికులు పనిచేశారు. పాఠశాలలో 40 మందిలోపు విద్యార్థులుంటే రూ. 2000 వేతనంతో ఒకరిని, వంద కంటే ఎక్కువ విద్యార్థులుంటే రూ. 2,500 చొప్పున ఇద్దరు కార్మికులను నియమించారు. ఈ కార్మికులు నిత్యం పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. పాఠశాల ఆవరణలోని మొక్కలనూ సంరక్షించేవారు. తర్వాత ఈ పనులన్నీ గ్రామపంచాయతీల వారు చేస్తారని చెబుతూ స్కావెంజర్ల వ్యవస్థను రద్దు చేశారు. పాఠశాలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి స్కావెంజర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**స్కావెంజర్‌లను నియమించాలి**

పాఠశాలను పరిశుభ్రంగా ఉండాలంటే స్కావెంజర్ ల ఏర్పాటు తప్పనిసరి. స్కావెంజర్ లు లేకపోవడం వల్ల పాఠశాలలు అపరిశుభ్రంగా మారి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సీఎం చెప్పినట్టుగా స్కావెంజర్లను వెంటనే నియమించాలి.

– నవ్వాత్ సురేష్, టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

### స్కూల్ ఎంపిక విషయంలోనూ..

మొదటిసారి పిల్లలను స్కూల్‌కు పంపాలి అనుకొనే తల్లిదండ్రులు ముందుగా ఆ స్కూల్ స్థితిగతులను పూర్తిగా తెలుసుకోవాలి. పాఠశాలకు విద్యాశాఖ అనుమతులు ఉన్నాయా, అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారా, విద్యాబోధన ఎలా ఉంది, పాఠశాల సిబ్బంది, యాజమాన్యం ఎలా ఉన్నారు, పాఠశాల స్థితిగతులు, ఆటలాడుకోవడానికి ఆవరణలో గ్రౌండ్ ఉందా, మానసిక వికాస నిపుణులు ఉన్నారా, ఇలా ప్రతి ఒక్క విషయాన్ని పరిశీలించి సంతృప్తి చెందాకే పిల్లలను పాఠశాలలో చేర్పించాలి.

# జహీరాబాద్‌లో డీఏపీ కొరత..?

● ఆందోళన చెందుతున్న రైతులు



ఆటోల్లో రైతులు డీఏపీని తీసుకు వెళ్తున్నరైతులు

జహీరాబాద్, జూన్ 11: వానకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కొందరు ఫర్టిలైజర్ల దుకాణాల వారు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు ఎరువులకు ఎలాంటి కొరతలేదని చెబుతున్నప్పటికీ జహీరాబాద్‌లోని కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో కొన్ని రోజులుగా ఎరువులు స్టాక్ లేవని.. రేపు రమ్మని తిప్పి పంపుతున్నారు. అరువుకు అయితే ఓ రేటు, నగదు ఇస్తే మరో రేటు చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జహీరాబాద్‌లో 20కి పైగానే ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా, సుమారు 200 టన్నుల డీఏపీ ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఏ దుకాణానికి వెళ్లినా స్టాక్ లేదని, రేపు వస్తుందని చెబుతుండటంతో వ్యవసాయ అదను దాటుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొందరికి మాత్రం బస్తాలు.. బస్తాలు డీఏపీ విక్రయిస్తుండగా, తమ వరకు వచ్చేసరికి స్టాక్ లేదని అంటున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు ముందస్తుగా బుక్ చేసుకున్నారని దుకాణదారులు బుకాయిస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏవో ప్రవీణను సంప్రదించగా, దుకాణదారులు రైతులను ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్రస్తుతానికి అయితే స్టాక్ ఉందని అన్నారు.

**రెండురోజులుగా తిరుగుతున్న..**

డీఏపీ ఎరువు కోసం రెండురోజులుగా జహీరాబాద్‌కు వస్తున్నా.. నా ముందే డీఏపీ అమ్ముతున్నారు. నాకు మాత్రం స్టాక్ లేదని చెప్పారు. అదనుపై డీఏపీ అత్యవసరం. అందుకే రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అధికారులు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

అనిల్ రాథోడ్, రైతు, పిచేర్యాగడితాండ



ఎరువులు, విత్తనాల కోసం దుకాణాల్లో రైతులు



హైనా దాడిలో మృతి చెందిన మేకలు, గాయపడిన దూడ

## భయపెడుతున్న హైనా

● మరోసారి దాడి.. రెండు మేకలు మృతి

చిన్నకోడూరు, జూన్ 11: చిన్నకోడూరు మండలంలో హైనా మరోసారి తన పంజా విసిరింది. మాచాపూర్, మెట్టుపల్లి గ్రామాల్లో ఇటీవల హైనా దాడిలో 65 జీవాలు (గొర్రెలు, మేకలు), ఒక దూడ మృతి చెందగా 20 జీవాలకు, 3 పశువులకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున చంద్లాపూర్ గ్రామంలో హైనా దాడిలో రెండు మేకలు మృతి చెందగా, ఓ దూడకు తీవ్ర గాయాలు అయ్యాయి. చంద్లాపూర్ గ్రామానికి చెందిన రైతు బాల్లింగ్ వెంకటయ్య రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం రెండు మేకలను, ఓ దూడను తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప జాలి పెన్సింగ్‌లో వదిలి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారు జామున వచ్చి చూడగా రెండు మేకలు మృతి చెంది, దూడకు తీవ్ర గాయాలై ఉన్నాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకోని మేకలు, దూడపై దాడి చేసిన ఆనవాళ్లను బట్టి హైనాగా గుర్తించారు. గాయాలైన దూడకు పశు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. పరిహారం అందించాలని బాధిత రైతు వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరాడు. చుట్టూ పక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ సూచించారు. హైనా వరుస దాడులతో చుట్టూ పక్కల గ్రామాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

## జూలై 1 నుంచి నూతన చట్టాల అమలు

● మెదక్ ఎస్పీ బాలస్వామి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 11: కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసులు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన చట్టాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర, న్యాయ చట్టాలు-2023ను అమలులోకి తీసుకొస్తున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనే తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు, చేర్పులు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేష్, వెంకటరెడ్డి, జిల్లా సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జోన్‌లో సంగారెడ్డి సర్కిల్...!

● పాలన సౌలభ్యం కోసం విద్యుత్‌శాఖ మార్పులు

● వచ్చే నెల 1 నుంచి అక్కడి నుంచే ఆపరేషన్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలు వేగంగా విస్తరించడం.. భారీగా విద్యుత్ డిమాండ్ పెరగడం, లక్షల సంఖ్యలో కొత్త విద్యుత్‌కనెక్షన్లు వస్తుండటంతో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పాలన సౌలభ్యం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మేడ్చల్ రూరల్ జోన్ పరిధిలోని సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌ను మేడ్చల్ జోన్ కలుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. జూలై 1 నుంచి సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్ నిర్వహణ మేడ్చల్ జోన్ పరిధిలోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి సర్కిల్ మేడ్చల్ జోన్‌లోకి తీసుకురావడంతో ఈ జోన్‌లో సర్కిళ్ల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లు మేడ్చల్ జోన్ పరిధిలో ఉన్నాయి. గ్రేటర్‌లో పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లు ఉన్నాయి. మెట్రో జోన్ పరిధిలో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్ ఆపరేషన్ సర్కిళ్లు పనిచేస్తున్నాయి. రంగారెడ్డి జోన్‌లో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లు, మేడ్చల్ జోన్‌లో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉండగా కొత్తగా సంగారెడ్డి సర్కిల్‌ను కలిపారు. సంగారెడ్డి సర్కిల్‌లో పటాన్‌చెరువు, జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా మొత్తం 7.91 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఏరియాతోపాటు ఎక్కువ అపార్ట్‌మెంట్లు, కొత్తకాలనీలు ఏర్పాటు అవుతుండటంతో విద్యుత్‌శాఖ ఈ మార్పులు చేసింది. ముఖ్యంగా బీరంగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, బోల్లారం, పటాన్‌చెరువు వంటి ప్రాంతాల్లో విద్యుత్‌డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతుంది. ఈ నేపథ్యంలో నగరంలో ఎలాంటి విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉందో అదే తరహాలో శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్కిళ్లను విద్యుత్‌శాఖ విస్తరిస్తోంది.



మర్మాములలో లారీ ఓనర్ ఇంటి ముందు బైఠాయించిన కుటుంబ సభ్యులు

## నా భర్త ఆచూకీ చెప్పండి

● లారీ ఓనర్ ఇంటిముందు బైఠాయించిన వివాహిత

మద్దూరు, జూన్ 11: లారీ క్లీనర్‌గా పని చేయాలంటూ తన భర్తను తమిళనాడు పంపి, అతను కనిపించకుండా పోయేందుకు కారణమైన లారీ ఓనర్ తన భర్త ఆచూకీ చెప్పాలంటూ బాధితురాలితో సహా ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో చోటు చేసుకున్న ఘటన వివరాలు బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చందిన యాటెల్లి శ్రీకాంత్ కూలి పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన లారీ ఓనర్ బత్తిని కనకయ్య గత నెల 3న యాటెల్లి శ్రీకాంత్‌ను లారీ క్లీనర్‌గా పని చేసేందుకు స్థానిక డ్రైవర్ పున్నంచందర్‌రెడ్డితో కలిపి తమిళనాడుకు పంపించాడు. అక్కడి నమ్మకల్ జంక్షన్‌లో తన వద్ద రూ. 200 తీసుకుని వెళ్లిన శ్రీకాంత్ తిరిగి రాలేదని డ్రైవర్ చెబుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి నమ్మకల్ పోలీస్‌స్టేషన్ సహా పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పలు చోట్ల వెతికినా శ్రీకాంత్ ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు శ్రీకాంత్ ఫొటోతోపాటు ఆచూకీ తెలిపిన వారికి రూ. 10 వేలు బహుమతిగా ఇస్తామని కూడా పోస్టర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. అంతటితో ఆగకుండా తమిళనాడుతో తన భర్తతో గొడవ పడి.. అతడు కనిపించకుండా పోవడానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని గత నెల 15న శ్రీకాంత్ భార్య యాటెల్లి కవిత మద్దూరు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. నెల రోజులు కావొస్తున్నా భర్త ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం అత్త యాటెల్లి తార, మరది రమేష్‌తోపాటు పిల్లలు బంధువులతో కలిసి యాటెల్లి కవిత లారీ ఓనర్ ఇంటిముందు బైఠాయించింది. తన భర్త ఆచూకీ చెప్పాలని ఆందోళనకు దిగింది. సమాచారం అందుకున్న మద్దూరు ఏఎస్ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి వెళ్లి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. ఇరువర్గాలను చేర్యాల సీఐ కార్యాలయానికి తరలించారు. చేర్యాల సీఐ శ్రీను వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తమిళనాడు పోలీసులతో మాట్లాడి వారికి కేసును బదిలీ చేశారు. దీంతో గొడవ సద్దు మణిగింది.

## ఆశా వర్కర్లకు పరీక్షలు వద్దు: సీఐటీయూ

కొల్చారం, జూన్ 11: ఆశా వర్కర్లకు పరీక్షలు పెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె. నర్సమ్మ కోరారు. మంగళవారం ఆశాడే సందర్భంగా కొల్చారంలో ఎంహెచ్‌పీ మోహన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 33 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి అనేక రకాల శిక్షణ పొందినట్లు తెలిపారు. రిజిష్టర్లు రాయడం, ఆన్‌లైన్ పనిచేయడం, ప్రజలకు మందులు అందజేయడం, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు, ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. కరోనాను నియంత్రిచండంలో ఆశ వర్కర్లు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. వీరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ లీడర్స్ అని ప్రకటించిందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ప్రతి నెల రెండవ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, గీత, సబిత, సంశీల, నాగమణి, చంద్రకళ, నాశమ్మ, రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాల మార్పుపై హుస్నాబాద్ డీఈ పరిశీలన


పట్టణంలో రోడ్డుపక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న హుస్నాబాద్ డీఈ శ్రీనివాసులు

చేర్యాల, జూన్ 11: జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడంలో తలెత్తిన ఎల్‌సీ అనుమతుల విషయమై హుస్నాబాద్ డీఈ శ్రీనివాసులు చేర్యాలలో పర్యటించారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తికి అడ్డంకిగా రోడ్డుపక్కన ఉన్న స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుకు ఎల్‌సీ మంజూరు చేయాలని కోరుతూ, ఇటీవల మునిసిపల్ పాలకవర్గం వినతిపత్రం అందించింది. ఈ క్రమంలో మంగళవారం ఆయన మునిసిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్ తదితరులతో కలిసి చేర్యాల పట్టణంలో పర్యటించారు. ఎల్‌సీ మంజూరు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు.

# సాగుపై కొరవడిన అవగాహన

- రైతు వేదికల్లో నామమాత్రంగా సదస్సులు
- ముందుగా సమాచారం చేరవేసి విత్తన దుకాణాలను తనిఖీ చేసినట్టు ఆరోపణలు

నారాయణరావుపేట, జూన్ 11: వర్షాకాలం సాగు కోసం రైతులు దుక్కులు దున్ని తొలకరి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పంటలసాగుపై రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడాన్ని వ్యవసాయ అధికారులు నారాయణరావుపేట మండలంలో నామమాత్రంగానే కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో ఆగమేఘాల మీద విత్తనాల పై అవగాహన సదస్సులు పెట్టి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో వ్యవసాయ అధికారులు రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించినట్లు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం అలసత్వం కనిపిస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. భూసార పరీక్షల నిర్వహించి, భూమి ఆవశ్యకత, పంట మార్పిడి, చీడ పీడల నివారణకు, విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### ముందుగా సమాచారం చేరవేసి తనిఖీలు

మండల వ్యాప్తంగా ఉన్న విత్తనాల విక్రయ దుకాణాలను వ్యవసాయ, పోలీసు అధికారులు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలి. కానీ నారాయణరావుపేట మండలంలో విత్తనాల దుకాణాల తనిఖీ సమయంలో డీలర్లకు ముందస్తుగా సమాచారం చేరవేసి ఆ తర్వాత తనిఖీలు నిర్వహించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


విత్తన దుకాణంల్లో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయ, పోలీసు అధికారులు (ఫైల్)

### సమాచార చేరవేతలో అలసత్వం

ప్రభుత్వం చేపట్టే కార్యాక్రమాలు గానీ, ఇటీవల ప్రభుత్వం సబ్సిడిపై అందిచిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ గురించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదని, దీంతో పచ్చిరొట్ట వేయలేకపోయామని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖతో పాటు అనుబంధంగా పశుసంవర్ధకశాఖ అందిస్తున్న రాయితీలు వంటి వాటి గురించి అవగాహన కల్పిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

గజ్వేల్, జూన్ 11: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాలను మంగళవారం గజ్వేల్ వ్యవసాయశాఖ ఏవో నాగరాజు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు రసీదు ఇవ్వాలని, విధిగా స్టాక్‌బోర్డు, ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేందర్, రమేశ్ తదితరులున్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి


స్వరూప(ఫైల్)

అక్కన్నపేట, జూన్ 11: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. అక్కన్నపేట మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు సమీపంలో పంతులు తండా క్రాస్‌రోడ్ వద్ద సోమవారం ఆర్టీసీ అద్దె బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కవిత అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, పంతులు తండాకు చెందిన మహిళా కూలి కరెంటుతు స్వరూప (38) ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వరూప మంగళవారం మృతిచెందింది. భర్త రాజు కాలు విరగడంతో పాటు గాయాలు కావడంతో చికిత్స పొందుతున్నాడు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకే ప్రమాదంలో అన్నదమ్ముల భార్యలు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొన్నది.

## మహిళపై దాడి చేసి.. పుస్తెలతాడు అపహరణ


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ములుగు, జూన్ 11: మహిళపై దాడి చేసి పుస్తెలతాడు అపహరించిన సంఘటన మండలంలోని తునికిబొల్లారం ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలో మంగళవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తున్కిబొల్లారానికి చెందిన శ్యామల శంకరమ్మ(45) ఆర్అండ్ఆర్ కాలనీలో కిరాయికి ఉంటున్నది. మంగళవారం ఉదయం 5:30 గంటలకు వాకింగ్ చేస్తున్న క్రమంలో ఓ పాఠశాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఆమె తలపై సుత్తితో కొట్టి పుస్తెలతాడును దొంగలించారు. ఆమె లక్ష్మక్కపల్లి ఆర్విఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. ఆమె కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

- ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి


కొండపాక అంకిరెడ్డిపల్లిలో బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొండపాక, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని అంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కోరారు ప్రభుత్వం పిల్లల కోసం పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నదని, ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని హితవుపలికారు.

- **మిరుదొడ్డి:** బడీడు పిల్లలను బడిలో చేర్పించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలని ఆరెపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని ఆరెపల్లిలో మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫీల్డ్‌అసిస్టెంట్ అర్జున్‌రావు ఉన్నారు.

# అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

- రీ సర్వే నిర్వహించి అనర్హులను తొలగించాలి
- మంత్రికి సీఐటీయూ, కాంగ్రెస్ నాయకుల వినతి


గజ్వేల్: మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, జూన్ 11: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో అర్హులందరికీ డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, గతంలో జరిగిన సర్వేలో అనర్హుల పేర్లు వచ్చాయని, మళ్లీ సర్వే నిర్వహించి అర్హులకు న్యాయం చేయాలని గజ్వేల్ సీఐటీయూ, కాంగ్రెస్ నాయకులు సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను రాష్ట్ర సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మూడు దఫాలు సర్వే నిర్వహించి 1550 మందిని ఎంపిక చేసి, వారిలో 1100 మందిని డ్రా ద్వారా ఎంపిక చేసిందని తెలిపారు. కానీ వీరిలో సొంత ఇళ్లు, స్థలాలు భూములు కలిగిన వారికి స్థానికంగా గుర్తింపు కార్డులు లేని వారికి, ఒకే కుటుంబానికి చెందిన వారిని డబుల్ బెడ్రూంల కోసం ఎంపిక చేశారని ఆరోపించారు. 30 సంవత్సరాలుగా స్థానికంగా కిరాయికి ఉంటున్న పేదలకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదని, వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారివెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సీఐటీయూ నాయకులు నర్సింహులు, వెంకటచారి, డబుల్ బెడ్ రూం ఇళ్ల సాధన కమిటీ సభ్యులు పద్మ, లక్ష్మి, చంటి, వెంకటేష్, మంజుల, అంజమ్మ తదితరులున్నారు.

### గ్రామాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం కృషి

ములుగు, జూన్ 11: గ్రామాల అభివృద్ధి కోసమే ప్రభుత్వం కృషి చేస్తున్నదని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ములుగు మండల కాంగ్రెస్ నాయకులు మంత్రిని కలిసి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు రమేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, బూరం గణేష్‌యాదవ్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జోగని రవి, అర్జున్ తదితరులు ఉన్నారు.

## కౌశిక్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 11: రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డి చేసిన అసత్య ఆరోపణలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బలహీణ వర్గాలకు చెందిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుగుదలను జీర్ణించుకోలేక కౌషిక్‌రెడ్డి మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తూ, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించే విధంగా ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డి మాట్లాడడం సబబుకాదని వెంటనే తన మాటల్ని వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ అక్కన్నపేట మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, కౌన్సిలర్లు వల్లపు రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ బండికుమార్, బాలయ్య, సంఘకుమార్, మార్క అనిల్‌గౌడ్, దుబాల శ్రీనివాస్, బందెల హరీష్‌బాబు, విక్రమ్ తదితరులు ఉన్నారు.

### తాత్కాలిక ప్రాతిపదికన హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూన్ 11: గజ్వేల్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ ఎంఈవో సునీత తెలిపారు. స్థానికులైన మహిళలకు అవకాశం ఇవ్వనున్నామని, 7వ తరగతి చదివిన వారై ఉండాలని, 400మంది విద్యార్థులకు వంట చేసే సామర్థ్యం ఉండాలన్నారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు ఫారంతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు, అనుభవ ధృవపత్రాలు జతపరిచి పాఠశాలలో అందజేయాలని ఆమె అన్నారు.

### నేడు సర్వసభ్య సమావేశం

నారాయణరావుపేట,జూన్11: నారాయణరావుపేట మండల సర్వసభ్య సమావేశం నేడు ఎంపీపీ ఓగ్గు బాలకృష్ణ అధ్యక్షతన, మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీరాములు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

### 13న జగదేవ్‌పూర్‌లో తైబజార్ వేలం

జగదేవ్‌పూర్, జూన్ 11: ఈ నెల 13న గురువారం జగదేవ్‌పూర్ మేజర్ గ్రామ పంచాయతీలో తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. పశువుల సంత, కూరగాయల మార్కెట్‌కు వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు ముందస్తుగా రూ.10000 డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

### నేడు విద్యుత్ అంతరాయం

గజ్వేల్, జూన్ 11: విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని గజ్వేల్ విద్యుత్ శాఖ ఏఈ మారుతి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని బాలాజీ ఎన్‌క్లేవ్, సిరి ఎన్‌క్లేవ్, కోర్టు ప్రాంతం, కృష్ణాలయం, లక్ష్మీప్రసన్ననగర్, టీవీఎస్ గల్లీ, ఎయిర్‌టెల్ గల్లీ, శివాలయం వీధిలలో ఉదయం 6 గంటల నుంచి 8.45 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. గజ్వేల్ పట్టణంలోని సంతోష్ థియేటర్ ఏరియా, రాజిరెడ్డి పల్లి, ధనలక్ష్మీకాలనీ, బీడీ కాలనీ, పిడిచెడ్ రోడ్డు, మహతి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

### ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వీడియో కాన్ఫరెన్స్

చిన్నకంకరంపేట, జూన్ 11: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించే విధానంపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతువేదికలో జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, ఉప సంచాలకులు వసంత సుగుణ, రాజ్ నారాయణలు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు పంటల అధిక దిగుబడితో పాటు ఆదాయం పెరిగే పద్ధతులను వివరించారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చేర్యాల/నంగునూరు, జూన్ 11: నంగునూరు మండలం ఖాతా నుంచి చేర్యాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రివేళలో ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ శివారులోని పెద్దమ్మగడ్డ కాలనీ సమీపంలో ట్రాక్టర్లను స్వాధీనపరుచుకున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చేర్యాల మండలం కమలాయపల్లి గ్రామశివారులో అక్రమంగా డంప్ చేసిన సుమారు 15 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఇటీవల సీజ్‌చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఆ ఇసుకను వేలం వేయనున్నామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని ఇన్‌చార్జి తహసీల్దారు కోరారు.

నంగునూరు మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం తెల్లవారుజామున నంగునూరు మండలం ఖాతా పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేసి, ఖాతా గ్రామానికి చెందిన వల్లెపు అనిల్, చామంతుల రమేశ్ పట్టుకున్నారు. రాజగోపాలపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 'గురుకులానికి సొంత భవనం నిర్మించాలి'

హుస్నాబాద్, జూన్ 11: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతున్నదని, సొంత భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి, నూతన భవనాన్ని నిర్మించేలా మంత్రి పొన్నం ప్రభాకర్ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ఆరు సంవత్సరాలుగా అద్దె భవనంలో నడుస్తున్నదని, విద్యార్థినిలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గత సంవత్సరం ఈ పాఠశాల కళాశాలగా మారినప్పటికీ, సరిపడా తరగతి గదులు లేక విద్యార్థినిలను సిద్దిపేట జిల్లా వర్గల్‌లో ఉన్న బీసీ గురుకుల పాఠశాలకు అనుసంధానం చేశారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం కూడా అడ్మిషన్లను ఇక్కడ తీసుకుని విద్యార్థులను వర్గల్ బీసీ గురుకులకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### పిడుగుపడి పాడి ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు

నారాయణరావుపేట,జూన్11: పిడుగుపడి పాడిఆవు మృతిచెందిన సంఘటన మండలంలోని మాల్యాలలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన బండారి కనకయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు పాడిఆవును పొలం వద్ద మేత కోసం కట్టేశాడు. పిడుగుపడి పాడిఆవు మృతి చెందింది. ఆవు విలువ సూమారు రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

# ఆర్టీసీ అద్దె బస్సులతో వరుస ప్రమాదాలు

- పక్షం రోజుల్లోనే ముగ్గురి మృతి
- అప్రతిష్ఠ పాలవుతున్న హుస్నాబాద్ ఆర్టీసీ డిపో

హుస్నాబాద్, జూన్ 11: హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సులతో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. పక్షం రోజుల్లోనే ఆర్టీసీ అద్దె బస్సుల కారణంగా జరిగిన ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. గత నెల 24వ తేదీన హుస్నాబాద్ పట్టణంలో కరీంనగర్ రోడ్డు సబ్ స్టేషన్ సమీపంలో ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కోహెడ మండలం రాంచంద్రాపూర్‌కు చెందిన దావ రాము అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం అక్కన్నపేట మండలం పంతుల్ తండా వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని ఆర్టీసీ అద్దె బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కరంటోతు కవిత అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా స్వరూప, రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వరూప మంగళవారం మృతిచెందింది. ఈ రెండు సంఘటనలు పక్షం రోజుల్లోనే చోటుచేసుకున్నాయి. అధికారుల నిర్వాహణ లోపం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయా..? అనే ఆరోపణలు వినవస్తున్నాయి. హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో 22 అద్దె బస్సులుండగా, వాటిలో రెండు ఎక్స్‌ప్రెస్‌లు, 20 పల్లె వెలుగులున్నాయి. కండక్టర్లు ఆర్టీసీకి చెందిన వారుండగా డ్రైవర్లను మాత్రం బస్సు కాంట్రాక్టర్లు నియమించుకుంటారు. ఒక్కో బస్సుకు ఇరువురు డ్రైవర్లుంటారని, వారిని వైద్య పరీక్షల అనంతరమే విధుల్లోకి తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు మృతుల బంధువులు ఆర్టీసీపై మండిపడుతుండగా, అధికారులు మాత్రం తమకేమీ సంబంధంలేదని, సంబంధిత బస్సు కాంట్రాక్టర్ అన్ని చూసుకోవాల్సి ఉంటుందని, ఇది అగ్రిమెంట్‌లో కూడా ఉంటుందని పేర్కొంటున్నారు. ఆర్టీసీ సంస్థ బస్సులను అద్దెకు తీసుకున్నప్పుడు ఏది జరిగినా ఆర్టీసీ చూసుకోవాలి తప్పా కాంట్రాక్టర్‌తో సంబంధం ఎందుకు ఉంటుందని బాధితులు మండిపడుతున్నారు.

## 'పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే చెల్లించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామిగౌడ్

హుస్నాబాద్, జూన్ 11: గత సంవత్సరం నుంచి తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందిన బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సర్వాయిపాపన్న మోకుదెబ్బ(గౌడసంఘం) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం గీతా కార్మికులను చిన్న చూపుచూసిందని, అందుకే కేసీఆర్ ప్రభుత్వాన్ని గీతా కార్మికులు గద్దెదింపారన్నారు. గత ప్రభుత్వం లాగా ప్రస్తుత ప్రభుత్వం చేయకుండా గీత కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గీతా కార్మికుల సంక్షేమం కోసం పెద్ద పీట వేయాలన్నారు. ప్రమాదాలు అరికట్టడానికి సేఫ్టీ మోకులు అందివ్వాలన్నారు. గీతా కార్మికుల ప్రయోజనాల కోసం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవచూపించాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘ ప్రిన్సిపాల్ కార్యదర్శి బుర్ర వెంకటేశం, చీకట్ల రవీందర్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంది రంజిత్‌కుమార్, నాయకులు పచ్చిమట్ల రాంబాబుగౌడ్, ఆకుల శ్రీనివాస్, మాజీ ఎంపీటసీ కక్కెర్ల సంపత్, మొగిళి, పూదరి ముత్తయ్య, సునీల్ తదితరులు ఉన్నారు.

### ఎక్కడి చెత్త అక్కడే?


ఆలయం ఎదుట కాల్చిన చెత్త

గజ్వేల్, జూన్ 11: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తుంది. సాక్ష్యాత్తు మునిసిపల్ చైర్మన్ వార్డులోనే చెత్తను తొలగించడంలో అటు అధికారులు, పర్యవేక్షణ చేయడంలో ఇటు మునిసిపల్ చైర్మన్ విఫలమవుతున్నారు. వార్డులోని సాయిబాబా ఆలయం ఎదుట చెత్తను కాల్చుతుండగా, వార్డులో ఎక్కడ చూసినా చెత్తే దర్శనమిస్తున్నది. ఇక ఓ హోటల్ సమీపంలో కొన్ని రోజులుగా చెత్తను తీయకపోవడంతో అక్కడే పేరుకుపోయింది.

### ఏఐఎస్‌బీ మెదక్ కన్వీనర్ నియామకం

చేర్యాల, జూన్ 11: ఆల్‌ఇండియా స్టూడెంట్‌బ్లాక్ మెదక్ జిల్లా కన్వీనర్‌గా కొండ ప్రశాంత్‌ను నియమిస్తూ, రాష్ట్ర నాయకుడు అందె బీరయ్య మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పాటుపడుతానన్నారు.

### 'పదవి ఊడుతుందనే విమర్శలు'


మిరుదొడ్డిలో మాట్లాడుతున్న ఎంపీటీసీలు

మిరుదొడ్డి, జూన్11: మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు అవిశ్వాస తీర్మానంలో తన పదవి ఊడిపోతుందనే భయంతోనే ఎంపీటీసీలపై విమర్శలను చేస్తున్నారని జడ్పీటీసీ లక్ష్మీ, మిరుదొడ్డి ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజు మండిపడ్డారు. మంగళవారం మిరుదొడ్డిలో ఎంపీటీసీలతో కలిసి మాట్లాడారు. ఐదేళ్లలో గుర్తుకురాని, అభివృద్ధి ఇప్పుడు గుర్తుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. ఈనెల 13న ఎంపీపీపై అవిశ్వాసం పెట్టేందుకు తీర్మానం పంపగానే, ఈనెల 10న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించడం నియంతపాలనకు నిదర్శమన్నారు.

## ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయండి

- ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల శ్రేణులకు నాయకుల పిలుపు


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గజ్వేల్, జూన్ 11: జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల శ్రేణులకు నాయకుల పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనగారి రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాం, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు మైస రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 7న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్‌లో మందకృష్ణ నేతృత్వంలో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు లక్షలాది మంది తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. వారితో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు పిస్నింటి శ్రీహరి, సింధు, ఎమ్మార్పీఎస్ నాయకులు బొంది స్వామి, తప్పెట రాములు, మినుముల కరుణాకర్, పోతగల్ల మహేశ్ తదితరులున్నారు.

# ప్రభుత్వ అతిథి గృహంపై పట్టింపేది?

- చెదలు, తుప్పుతో నాశనమవుతున్న సామగ్రి
- రూ.85వేల పైచిలుకు విద్యుత్ బిల్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తొగుట, జూన్ 11: లక్షలు వెచ్చించి అతిథి గృహాన్ని నిర్మించారు. కానీ ఇప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు అటు కన్నెత్తి కూడా చూడడంలేదు. దీంతో అందులో ఉన్న లక్షలు విలువ చేసే సామగ్రి చెదలు, తుప్పు పట్టి నాశనమవుతున్నది.

### అప్పటి సీఎం చేతుల మీదుగా ప్రారంభం

తొగుట గ్రామంలో పంచాయతీరాజ్ నిధుల నుంచి లక్షలు వెచ్చించి అధునాతన హంగులతో ప్రభుత్వ అతిథి గృహాన్ని అప్పటి దొమ్మాట ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి నిర్మించారు. ఆ అతిథి గృహాన్ని అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం చంద్రబునాయుడు 2000 సంవత్సరం జనవరి 9న అట్టహాసంగా ప్రారంభించారు. ప్రభుత్వం ఆ అతిథి గృహంలో అధునాతనమైన ఫర్నీచర్, ఏసీలతో కూడిన రూములు ఏర్పాటు చేసింది.


అతిథి గృహం, ఇన్‌సెట్‌లో పెచ్చులుడిన స్లాబ్



అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించినట్లుగా ఏర్పాటు చేసిన శిలాఫలకం

### నాడు గొప్ప.. నేడు దిబ్బ

సిద్దిపేటకు ఏ అధికారి, ప్రజా ప్రతినిధి వచ్చినా అప్పట్లో తొగుట ప్రభుత్వ అతిథి గృహంలోనే బస చేసేవారు. అలాంటిది ఇపుడు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అందులో ఉన్న టీవీలను కూడా ఎత్తుకుపోయారు. మిగతా ఫర్నీచర్ అంతా ధ్వంసమై ఇపుడు అంతా బూత్ బంగ్లాను తలపిస్తున్నది. చివరిసారిగా 2014 ఎప్రిల్ 23న ప్రభుత్వ అతిథి గృహానికి వచ్చిన విద్యుత్ బిల్లును చెల్లించి చేతులు దులుపుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ మీటర్ నెంబర్ 697 పైన రూ.85943 విద్యుత్ బిల్లు పేరుకుపోయింది.


ఫర్నిచర్‌కు చెదలు, తుప్పుపట్టిన దృశ్యం

### విద్యుత్ అధికారుల్లోనూ అలసత్వం

బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంట్ కనెక్షన్ కూడ తొలగించారు. అంత బిల్లు ఉన్నా అధికారులు రికవరీ ఎందుకు చేయడంలేదన్న విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. సామాన్యుల ఇళ్లపై కొద్దిపాటి బిల్లు పెండింగ్ ఉంటేనే వారిపట్ల దయచూపని అధికారులు ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో అతిథి గృహాన్ని కొందరు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అతిథి గృహాన్ని వాడుకలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుని, అందులోని ఫర్నీచర్ నాశనం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆత్మీయ సమ్మేళనం



దుబ్బాక మున్సిపాలిటిలోని లచ్చపేట వార్డులో ఉన్న జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 1993-94లో పదోతరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువలతో సన్మానించారు.

- దుబ్బాక